TG/TEL/25/A3731

నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్ధ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-264 | పేజీలు:-4 | మంగళవారం 08-09-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:264 | pages:04 | Tuesday - 08-09-2026

ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?

- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ

ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు - మిగతా 2 లో

మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం

- బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య
- శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ

తెలంగాణ శాసనసభ సమావేశాల - మిగతా 2 లో

తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు

2లో

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

ఆరావళి కమిటీకి సీజేఐ చురకలు

- ఆరావళి కమిటీ పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు పొడిగింపును తిరస్కరించిన ధర్మాసనం
- నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదిక సమర్పించాలని స్పష్టమైన ఆదేశం
- గడువులోగా పూర్తిచేయకుంటే కమిటీని పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక
- అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని కమిటీకి సూచించిన కోర్టు

ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, పరిరక్షణపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్ పీసీ) పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. తుది నివేదిక సమర్పణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు కావాలని కమిటీ కోరడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. - మిగతా 2 లో

మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం

డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైల్లను, కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య

2లో

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు

ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష

- టోక్యో నిర్మలమైన ఆకాశాన్ని చూపిస్తూ ఓ భారతీయుడి వీడియో
- ఢిల్లీ ఆకాశం అలా ఎందుకు ఉండదని సూటి ప్రశ్న
- ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువే అయినా కాలుష్యం తక్కువ
- ప్రయత్నిస్తే ఢిల్లీని కూడా పరిశుభ్రంగా మార్చవచ్చని ఆశాభావం

జపాన్ రాజధాని టోక్యోలో నివసిస్తున్న ఓమ్ అనే భారతీయుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. - మిగతా 2 లో

స్టాక్ మార్కెట్‌కు మళ్లీ నష్టాలు.. 382 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

- 118 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- ఐటీ, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు
- 23,800 స్థాయిపై నిఫ్టీకి ఒత్తిడి
- మిడ్‌క్యాప్ పతనం, స్వల్పంగా పెరిగిన స్మాల్‌క్యాప్
- ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. - మిగతా 2 లో

ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

- ప్రపంచ కుబేరుల సంపద 15.1 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిక
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెట్టుబడులతో భారీగా పెరిగిన ఆస్తులు
- ప్రపంచవ్యాప్తంగా 3,795కి ఎగబాకిన బిలియనీర్ల సంఖ్య
- కుబేరుల సంఖ్యలో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఉత్తర అమెరికా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తడంతో ప్రపంచ కుబేరుల సంపద సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 నాటికి బిలియనీర్ల మొత్తం ఆస్తి 15.1 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ 'అల్ట్రాటా' తన 'బిలియనీర్ సెన్సస్ 2026' నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగి 3,795కి చేరగా, వారి సంపద 12.8 శాతం మేర వృద్ధి చెందింది. - మిగతా 2 లో

నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా - మిగతా 2 లో

వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం

2లో

రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు

కార్యకర్తలే పార్టీకి బలం వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో చంద్రబాబు

- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో ముఖ్యమంత్రి- మిగతా 2 లో

నిజం దృష్టి తెలుగు న్యూస్
మంగళవారం 08-09-2026

ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు.. జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష

మొదటిపేజీ తరువాయి - టోక్యోలోని స్వచ్ఛమైన నీలాకాశాన్ని చూపిస్తూ, మన దేశ రాజధాని ఢిల్లీలో ఆకాశం ఎందుకు ఇలా నిర్మలంగా ఉండదని ఆయన ప్రశ్నించారు. ఈ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటూ, రెండు నగరాల మధ్య నెలకొన్న భిన్నమైన వాతావరణ పరిస్థితులపై చర్చకు దారితీసింది. భారత్‌లో కాలుష్యానికి అధిక జనాభానే ప్రధాన కారణమని చాలామంది భావిస్తుంటారని, కానీ వాస్తవానికి ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ టోక్యోలో గాలి, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయని తన వీడియోలో వివరించారు. "భారతీయ ఆకాశాలతో ఉన్న సమస్య" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్‌ను పంచుకున్నారు. తన విదేశీ స్నేహితుల్లో కొందరు భారతదేశం అనగానే జనసమ్మర్దంతో కూడిన, దుమ్ముధూళితో నిండిన ప్రాంతంగా భావిస్తుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారికి హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఈశాన్య రాష్ట్రాల వంటి అందమైన, అత్యంత పరిశుభ్రమైన ప్రాంతాల గురించి తాను వివరిస్తుంటానని ఆయన పేర్కొన్నారు. మన దేశ రాజధానిలో కూడా స్వచ్ఛమైన ఆకాశం, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటే పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని ఓమ్ అభిప్రాయపడ్డారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే ఇది కచ్చితంగా సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్‌కు మళ్లీ నష్టాలు.. 382 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

మొదటిపేజీ తరువాయి - వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750-23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

మొదటిపేజీ తరువాయి - గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. ముఖ్యంగా ఏఐ రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిన కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరగడమే ఈ సంపద వృద్ధికి ప్రధాన కారణమని 'అల్ట్రాటా' నివేదిక స్పష్టం చేసింది. సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులు, ప్రధాన వాటాదారులు అత్యధికంగా లాభపడ్డారు. ఈ నివేదిక ప్రకారం, సంపద కేంద్రీకరణ కూడా తీవ్రస్థాయిలో ఉంది. 50 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తి ఉన్న 29 మంది 'సూపర్ బిలియనీర్ల' చేతిలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద కేంద్రీకృతమై ఉంది. ఇది మొత్తం బిలియనీర్ల ఆస్తిలో దాదాపు 27 శాతానికి సమానం. ప్రాంతాల వారీగా చూస్తే, 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత యూరప్ (1,081), ఆసియా (881) ఉన్నాయి. అయితే, ఈ సంపదలో అధిక భాగం స్టాక్ మార్కెట్ విలువలతో ముడిపడి ఉన్నందున, 'ఏఐ'పై సెంటిమెంట్ మారితే ఇందులో హెచ్చుతగ్గులు ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే దశాబ్దంలో సుమారు 6.6 ట్రిలియన్ డాలర్ల సంపద దాదాపు 5,000 మంది వారసులకు బదిలీ అవుతుందని కూడా అల్ట్రాటా అంచనా వేసింది.

నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

మొదటిపేజీ తరువాయి - పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?



మొదటిపేజీ తరువాయి - అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

మొదటిపేజీ తరువాయి - ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం, నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించి తీరాలని సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువును పొడిగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీ కోరిన గడువు (2027 ఫిబ్రవరి 28) తన పదవీ విరమణ తేదీ తర్వాత ఉందని సీజేఐ చురక అంటించారు. "కమిటీ ప్రాథమికంగా నా పదవీ విరమణ వరకు వాయిదా కోరినట్లుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి గడువులోగా నివేదికను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించడంలో విఫలమైతే, కమిటీని పునర్వ్యవస్థీకరించే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ, మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని తెలిపారు. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన సంఘాలతో సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా తీసుకోవడానికి అదనపు సమయం అవసరమని కోరారు. అయితే, ఆరు నెలల గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు, కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చింది. నివేదికను ఖరారు చేసే ముందు అన్ని వర్గాలతో సమర్థవంతంగా సంప్రదింపులు జరపాలని కమిటీకి సూచించింది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది జూన్‌లో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ) డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని ఈ కమిటీ వాస్తవానికి ఆగస్టు 31 నాటికే నివేదిక ఇవ్వాల్సి ఉంది. పర్వత శ్రేణిగా గుర్తించాలంటే కనీసం 100 మీటర్ల ఎత్తు ఉండాలన్న నిబంధన వల్ల పర్యావరణపరంగా కీలకమైన ప్రాంతాలు పరిరక్షణ చట్రం నుంచి బయటకు వెళ్లే ప్రమాదం ఉందని గతంలో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక కీలకంగా మారింది. ఈ కేసులో తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం

మొదటిపేజీ తరువాయి - చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభలో స్పష్టం చేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ, డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు. ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలి. డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు. తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టం చేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం

పిల్లలకు వస్తువుల విలువ కాదు... జీవితం విలువను నేర్పిద్దాం

బ్రాండ్ జీవితానికంటే పెద్దదైపోతే "ఒక బ్రాండ్ లేకపోతే జీవితం విలువలేనిదని ఒక పిల్లవాడు భావించే స్థితికి మనం ఎందుకు తీసుకెళ్తున్నాం?" కొన్ని రోజుల క్రితం మహారాష్ట్రలోని ఖద్వా డోంగర్ విషాద ఘటన నా హృదయాన్ని కలచివేసింది.

ఈ ఘటన దేశంలో ఉన్న తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు విద్యార్థులకు సంబంధించింది.

.18 ఏళ్ల యువకుడి కుటుంబ వివాదం నేపథ్యంలో జరిగిన ఈ ఘటనలో తల్లిదండ్రులతో సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రారంభ వార్త పత్రిక కథనాల్లో ఖరీదైన ఐఫోన్ ప్రస్తావన రావడం జరిగింది. కాబట్టి ఒక ఫోన్‌ను నిందించడం కాదు --- మన పిల్లలలో పెరుగుతున్న వినియోగ సంస్కృతిని పరిశీలించడం మన అసలు బాధ్యత. ఇలాంటి వినియోగ విష సంస్కృతి పిల్లల జీవితాల్లో అనేకమైనటువంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది పరిస్థితిని గమనిస్తే సమస్య ఐఫోన్ కాదు... ఆలోచనా విధానం. ఈరోజు సమాజంలో పిల్లల కోరికలను వ్యాపార వాణిజ్య ప్రకటనలు, సోషల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్లు, ట్రెండ్లు, స్నేహితుల ఒత్తిడి ప్రభావితం చేస్తున్నాయి. 2024 లో జరిగిన ఒక సర్వేలో భారత దేశంలో 13 నుంచి 18 సంవత్సరాల వయసు గల బాలబాలికలలో తమ వద్ద బ్రాండెడ్ వస్తువులు లేకపోవడం ఒక ఆత్మ న్యూనతగా భావిస్తున్నారు.

"నా దగ్గర ఏ బ్రాండ్ ఉంది?"

"ఇతరుల దగ్గర ఉన్నది నా దగ్గర ఎందుకు లేదు?"

"నేను ఏ వస్తువు వాడితే గొప్పగా కనిపిస్తాను?"

అనే ప్రశ్నలు క్రమంగా విద్యార్థులను యువకులను తీవ్రంగా వేధిస్తున్నాయి.

బ్రాండ్ ఒక వస్తువుకు గుర్తింపు కావచ్చు. కానీ అది వ్యక్తిత్వానికి గుర్తింపు కాకూడదు. పిల్లల ప్రతి కోరికను తీర్చడం ప్రేమకు గుర్తు కాదు.

కొన్నిసార్లు "ఇది ఇప్పుడు మనకు అవసరం లేదు", "ఇది మన బడ్జెట్‌లో లేదు" అని చెప్పడం కూడా మంచి పెంపకంలో భాగమే.

పిల్లలకు చిన్నప్పటి నుంచే న

అవసరం - కోరిక

సౌకర్యం - విలాసం ఆకాంక్ష - హక్కు

వేరని చెప్పాలి.

తల్లిదండ్రులు సంపాదించే ప్రతి రూపాయి వెనుక ఉన్న శ్రమను పిల్లలకు అర్థమయ్యే విధంగా వివరించాలి.కౌమారదశలో పిల్లలు తిరస్కరణ, పోలికలు, స్నేహితుల ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావం వంటి వాటికి సున్నితంగా స్పందించాలి.

ఒక వస్తువు దొరకకపోవడం ఓటమి కాదని,ఒకరి దగ్గర ఉన్నది మన దగ్గర లేకపోవడం మన విలువను తగ్గించదు అని చెప్పాలి.జీవితంలో నిరాశలు వస్తాయి అని ,వాటిని తట్టుకుని ముందుకు సాగడం నేర్చుకోవడం నిజమైన బలం పిల్లలకు అర్థమయ్యే విధంగా వివరించాలిప్రతి కోరికను వెంటనే తీర్చుకోవాల్సిన అవసరం లేదని, "లేదు" అనే సమాధానాన్ని కూడా గౌరవంగా స్వీకరించవచ్చని పిల్లలకు నేర్పాలి.

వస్తువులను ఉపయోగించాలని అంతే తప్ప వాటికి బానిసలుగా మారవద్దని తెలియజేయాలి.

బ్రాండ్లు మన అవసరాలను తీర్చుతాయి తప్ప అవి మన ఆత్మగౌరవాన్ని, సంబంధాలను నిర్ణయించలేవనే విషయం బలంగా చెప్పాలి

పాఠశాలలు కూడా మారాలి

విద్య అంటే మార్కులు, ర్యాంకులు, ఉద్యోగం మాత్రమే కాదు.పిల్లలకు సామాజిక మాధ్యమాల

కు సంబంధించిన విద్య , ఆరోగ్య విద్య, వినియోగ విద్య , ఆర్థిక విద్య కూడా నేర్పాలి. పిల్లలు చైతన్యం అయితే వాళ్లు సత్యాన్ని తెలుసుకుంటారు

వారు ప్రతి ప్రకటనను చూసి అర్థం చేసుకోవాలి.

"నాకు ఇది నిజంగా అవసరమా?" "నేను దీన్ని నా కోసం కోరుకుంటున్నానా, లేక అందరూ కలిగి ఉన్నందుకా?"

"ఈ ఇన్ఫ్లుయెన్సర్ నిజంగా నమ్మి చెబుతున్నాడా, లేక డబ్బు తీసుకుని ప్రచారం చేస్తున్నాడా?"

అందుకే ప్రతి తల్లిదండ్రి, ప్రతి ఉపాధ్యాయుడు పిల్లలకు ఈ ఒక్క ప్రశ్నను నేర్పాలి:

"నాకు ఇది నిజంగా అవసరమా? లేక నాకు ఇది కావాలని ఎవరో నేర్పించారా?"ఈ ప్రశ్న పిల్లల జీవితంలో ఒక ఆలోచనా శక్తిగా మారాలి.మన లక్ష్యం వినియోగదారులను తయారు చేయడం కాదు... ఆలోచించే మనుషులను తయారు చేయడం.వారికి వస్తువుల విలువ కంటే జీవిత విలువ తెలియాలి.

బ్రాండ్ కంటే వ్యక్తిత్వం గొప్పదని తెలియాలి.

సంపద కంటే సంబంధాలు విలువైనవని తెలియాలి.

విజయం అంటే ఇతరుల దగ్గర ఉన్న వస్తువులను సొంతం చేసుకోవడం కాదని అర్థం కావాలి.మన పిల్లలకు అత్యంత ఖరీదైన గాడ్జెట్ అవసరం లేదు.

అత్యంత విలువైన దృక్పథం అవసరం.బ్రాండ్ మన జీవితాన్ని సౌకర్యవంతం చేయవచ్చు --- కానీ మన జీవితానికి విలువను నిర్ణించకూడదు.మన పిల్లలకు వస్తువుల విలువ మాత్రమే కాదు... జీవిత విలువ కూడా నేర్పిద్దాం.

ఒక ఫోన్‌ను మార్చవచ్చు.

డబ్బును మళ్లీ సంపాదించవచ్చు.

ఒక బ్రాండ్ రేపటికి పాతబడిపోవచ్చు.

కానీ ఒక ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేం అన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

తల్లిదండ్రులకు 3 రోజుల ఛాలెంజ్:

1: మీ పిల్లలతో కూర్చుని వారి 5 కోరికలు రాయించండి, అవసరం జం కోరిక అని విడదీయండి.

2: మీ నెల జీతం ఎలా వస్తుంది, ఎలా ఖర్చవుతుందో పిల్లలకు వివరించండి.

3: ఇంట్లో ఉన్న ఒక పాత వస్తువును రిపేర్ చేసి మళ్లీ వాడటం నేర్పండి.

ఒక ఫోన్‌ను మార్చవచ్చు. డబ్బును మళ్లీ సంపాదించవచ్చు. కానీ ఒక ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేం.

మన పిల్లలకు వస్తువుల విలువ మాత్రమే కాదు... జీవిత విలువ కూడా నేర్పిద్దాం

డాక్టర్ మొహమ్మద్ ఆజమ్ అలీ , విద్యావేత్త
అసిస్టెంట్ ప్రొఫెసర్, రాష్ట్రపతి సేవ పురస్కార గ్రహీత
వీశీఎఅశ్రీవ 9866129052

మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం

మొదటిపేజీ తరువాయి - వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

తల్లికి అవమానం.. స్పీకర్ కంటతడి..

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు

నిజం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 7: తెలంగాణ అసెంబ్లీలో టిఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసినట్లు ఆరోపిస్తున్న అవమానకర వ్యాఖ్యల నేపథ్యంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కంటతడి పెట్టడం తీవ్ర చర్చకు దారితీసింది. అసెంబ్లీ సాక్షిగా ఒక దళిత బిడ్డ కన్నీళ్లు పెట్టుకోవలసిన పరిస్థితి రావడం బాధాకరమని, ఇటువంటి సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. స్పీకర్ వ్యక్తిగతంగా తన తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర మనస్థాపానికి గురైనట్లు వారు తెలిపారు. అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తులు అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో కొనసాగడాన్ని బీఆర్ఎస్ సభ్యులు ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పదవులలో ఉన్న వ్యక్తుల పట్ల గౌరవం, సభా మర్యాదలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభలో వ్యక్తిగత విమర్శలు, కుటుంబ సభ్యులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొంటూ, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సభా సాంప్రదాయాలను కాపాడాలని కోరారు. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో అసెంబ్లీ వాతావరణం వేడెక్కింది. వ్యాఖ్యలపై స్పీకర్ స్పందించిన తీరు, కంటతడి పెట్టిన ఘటన రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు క్షమాపణ చెప్పాలి

బోడుప్పల్ డివిజన్--11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్

నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,సెప్టెంబర్ 07: తెలంగాణ శాసనసభ స్పీకర్, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అహంకారపూరిత, అవమానకర వ్యాఖ్యలను మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్--10, డివిజన్--11 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న తెలంగాణ శాసనసభ స్పీకర్ పై ఇలాంటి భాషలో మాట్లాడటం కేవలం వ్యక్తిగత దూషణ మాత్రమే కాదు, యావత్ శాసనసభను, రాజ్యాంగ వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, హద్దులు దాటి రాజ్యాంగబద్ధమైన పదవులను కించపరిచే విధంగా మాట్లాడటం బీఆర్ఎస్ నాయకుల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా తమ అహంకార ధోరణిని విడిచిపెట్టకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. స్పీకర్ పదవి అనేది ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదు... అది తెలంగాణ శాసనసభ గౌరవానికి, రాజ్యాంగ వ్యవస్థకు ప్రతీక అని గుర్తుంచుకోవాలని తాతా మధుకు హితవు పలికారు. గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు మరియు శాసనసభకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బొమ్మక్ కళ్యాణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇలాంటి అహంకారపూరిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నిజం దృష్టి తెలుగు న్యూస్

మంగళవారం 08-09-2026

హైదర్‌నగర్‌లో అక్రమ నిర్మాణంపై వేగంగా చర్యలు: ప్రజల డిమాండ్

సెట్బ్యాక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా?

కుకట్‌పల్లిలో అక్రమ నిర్మాణంపై చర్యలేవి.

నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: కుకట్‌పల్లి శ్రీనివాసనగర్ నివాసితులు, శ్రీనివాసనగర్ పరిధిలో ఉన్న ప్లాట్ నం. 38 (సర్వే నం.114) వద్ద జరుగుతున్న అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యజమానికి అనుమతించిన ప్లాన్ ప్రకారం స్టిల్ట్‌తో పాటు మూడు అంతస్తులకే పరిమితం కావాల్సి ఉన్నా, సెట్బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే అనుమతించిన పరిమితికి మించి అనధికారంగా నిర్మాణం చేస్తున్నారని చెబుతున్నారు. ఇదివరకు జిహెచ్ఎంసి చర్యలు తీసుకుని నిర్మించిన గోడలను కూల్చివేసినా, యజమాని మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించారని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లంఘన గుర్తించి చర్య తీసుకున్న తర్వాత కూడా నిర్మాణం తిరిగి ఎందుకు కొనసాగిస్తున్నారని అర్థం కావడం లేదని, ఇప్పుడు అదనంగా మరిన్ని అంతస్తులు జోడించాలనే ప్రయత్నాలు కనిపిస్తున్నాయని వారు అంటున్నారు. పబ్లిక్ సేఫ్టీ దృష్ట్యా వెంటనే పనులను ఆపించి, అనుమతి లేని భాగాలను పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు. ఇటీవలే గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో అనుమతి లేని ఏడు అంతస్తుల భవనం కూలి మరణాలు సంభవించిన విషయం నివాసితులకు గుర్తుంది. ఆ ఘటన తర్వాత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అక్రమం, ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాలపై కూల్చివేత డ్రైవ్‌లను మరింత పెంచారని చెబుతున్నారు. కుకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాల్లో చిన్న ప్లాట్లలో కూడా సెట్బ్యాక్ ఉల్లంఘనలు గుర్తించి చర్యలు తీసుకున్నారని, అందుకే హైదర్‌నగర్ కేసును కూడా అదే రీతిలో చూడాలని స్థానికులు కోరుతున్నారు. కుకట్‌పల్లి సర్కిల్‌లో అధికారులు న్యాయంగా, వేగంగా, బాధ్యతతో చర్యలు తీసుకోవాలని నివాసితులు అభ్యర్థిస్తున్నారు. అనుమతి లేని నిర్మాణ భాగాలను వెంటనే కూల్చివేయడంతో పాటు, మరింత నిర్మాణం జరగకుండా పూర్తిగా నియంత్రణ ఉండేలా చూడాలని, అనుమతి ఆర్డర్, భవన నిబంధనలకు వ్యతిరేకంగా అదనపు అంతస్తులు చేర్చకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాన్స్ జెండర్లకు పోలీసుల స్పష్టమైన సూచనలు

ప్రజలు, వ్యాపారులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్ జెండర్ లను ఏసీబీ కెపిహెచ్బి ఆదేశాల మేరకు పోలీసులు పిలిపించి, ప్రజలకు మరియు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవహరించాలని స్పష్టమైన సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. షాపులు, వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాలు, వ్యాపార కార్యక్రమాలు లేదా ఇతర సందర్భాలలో యజమానులను, సిబ్బంది, ప్రజలను బలవంతంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయరాదని పోలీసులు సూచించారు. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, బెదిరించడం లేదా ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం, వంటి చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. అలాగే రాత్రి వేళల్లో రోడ్లపై షాపుల, వద్ద లేదా ఇతర ప్రాంతాలలో ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా డబ్బులు అడగడం వసూలు చేయడం చేయరాదని సూచించారు. ఎవరినైనా అడ్డుకోవడం, దురుసుగా ప్రవర్తించడం, బెదిరించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. పోలీసుల సూచనలను ఉల్లంఘించి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, బెదిరింపులకు పాల్పడడం లేదా ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు ఇచ్చిన సూచనలు హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి.. బిజెపి పోరుబాట

అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా వడ్డేపల్లి రాజేశ్వరరావు హౌస్ అరెస్ట్

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థుల ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న "ఫీజుల బకాయి బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి నియోజకవర్గ కార్యకర్తలతో కలిసి బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని కూకట్‌పల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఆయనను ఇంటి వద్దే నిర్బంధించి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని, బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టులు చేయడం, అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం ఆగదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

షాద్‌నగర్‌లో దశ 10 - ది ఫుడ్ పార్క్ ప్రారంభం

శుభాకాంక్షలు తెలిపి అభినందించిన మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

నిజం న్యూస్ ప్రతినిధి, షాద్‌నగర్, సెప్టెంబర్ 07 : షాద్‌నగర్‌లో దశ 10 - ది ఫుడ్ పార్క్ విజయవంతంగా ప్రారంభం కావడం పట్ల మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం దశ 10 - ది ఫుడ్ పార్క్ యజమానులు మాదురాపూర్ భార్గవ్ కుమార్ రెడ్డి, నవీన్, మల్లికార్జున్, సురేష్ మరియు మిత్రులకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఫుడ్ పార్క్ విజయవంతంగా కొనసాగుతూ షాద్‌నగర్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆహారం, మంచి సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు. ఇలాంటి నూతన వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు షాద్‌నగర్ అభివృద్ధికి దోహదపడతాయని తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పేర్కొన్నారు. దశ 10 - ది ఫుడ్ పార్క్ యజమానులు మాదురాపూర్ భార్గవ్ కుమార్ రెడ్డి, నవీన్, మల్లికార్జున్, సురేష్ మరియు మిత్రులకు మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

స్పీకర్ పై తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను

రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే

ఎమ్మెల్సీతాతా మధుపై చర్యలు తీసుకోవాలి వెంటనే సస్పెండ్ చేయాలి

తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్రాంరెడ్డి



నిజం న్యూస్ ప్రతినిధి, షాద్ నగర్ సెప్టెంబర్ 07 : తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు,ఫరూఖ్ నగర్ మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదు అని అన్నారు. స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు.. రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉంది అని వెంకట్ రాంరెడ్డి తెలిపారు,ఒక అట్టడుగు వర్గాల బిడ్డ, దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రాకుండా ఉంటారు. కానీ ఆయన పార్టీకి చెందిన నాయకులు మాత్రం బయటకు వచ్చి డ్రామాలు చేస్తున్నారు అని అన్నారు,స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని వెంకట్ రాంరెడ్డి డిమాండ్ చేశారు ,ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలి. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడినా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి అని వెంకట్ రాంరెడ్డి డిమాండ్ చేశారు ,శాసనసభ, స్పీకర్ పదవి పట్ల కనీస గౌరవం లేని విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలి బి ఆర్ ఎస్ పార్టీ నేతలకు వెంకట్ రాంరెడ్డి సూచించారు.

420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారు? -- బీఆర్ఎస్ డిమాండ్

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన

బాలానగర్ లో అధికారులకు వినతిపత్రాలు

నిజం న్యూస్ ప్రతినిధి, బాలానగర్ (జడ్చర్ల) సెప్టెంబర్ 07 : వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు, మాజీ మంత్రివర్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి ఆదేశాలతో బాలానగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, ఇకనైనా కాలయాపన చేయకుండా ప్రతి హామీ అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని, మిగిలిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాల్య నాయక్, వెంకటాచారి, శ్రీనివాసరావు, చెన్నారెడ్డి, గోపాల్ రెడ్డి, జగన్ నాయక్, బాలు నాయక్, గుడిసెల బాలయ్య, పెద్దయ్యపల్లి లక్ష్మయ్య , వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐదు కేసులు ఛేదించిన జగద్గిరిగుట్ట పోలీసులు

నిందితుల అరెస్ట్ -- 3.5 తులాల బంగారం మరియు రూ.10 లక్షల విలువైన బ్యాటరీల రికవరీ

నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 7జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించారు. కేసులకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన సొత్తు, మోసం ద్వారా తీసుకున్న నగదు మరియు బంగారాన్ని రికవరీ చేశారు.

1. మోసం కేసులో నిందితుడి అరెస్ట్ -- రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం మోసం

మోసం మరియు ఐటీ యాక్ట్‌కు సంబంధించిన కేసులో ఫిర్యాదు అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు కామినెడ్డి శివమోహన్ రెడ్డి, అక్కపల్లి గ్రామం, మార్కాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దర్యాప్తులో నిందితుడు గతంలో సుమారు 12 సంవత్సరాల పాటు లిూదీ (ఘుంష్ట్రుర్తీు ూవవఘ దీుశ్రీ)లిలో కానిస్టేబుల్‌గా పనిచేసినట్లు, అనంతరం విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తనతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో సర్వీసు నుండి తొలగించబడినట్లు గుర్తించారు. సర్వీసు నుండి తొలగించబడిన అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి, వివిధ వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుని వారి నమ్మకాన్ని సంపాదించి డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా ఇలాంటి మోసం కేసుల్లో జైలుకు వెళ్లినట్లు గుర్తించారు. ప్రస్తుత కేసులో బాధితురాలితో ఫోన్ ద్వారా పరిచయం ఏర్పరచుకుని, కొంతకాలం పాటు సన్నిహితంగా ఉంటూ ఆమె నమ్మకాన్ని సంపాదించాడు. అనంతరం తనకు, తన కుటుంబ సభ్యులకు వివిధ అవసరాలు ఉన్నాయని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తదితర కారణాలు చెబుతూ బాధితురాలిని నమ్మించి, వివిధ సందర్భాల్లో సుమారు రూ.9,00,000/- నగదు తీసుకుని మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. అదేవిధంగా సుమారు 3.5 తులాల బంగారం కూడా తీసుకుని, దానిని కంభం కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. నిందితుడిపై గతంలో కూడా మార్కాపురం, గిద్దలూరు ప్రాంతంలోని పోలీస్ స్టేషన్లలో ఇలాంటి మోసాలకు సంబంధించి కేసులు నమోదైనట్లు గుర్తించారు.

నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

1. అస్బెస్టాస్ కాలనీలో వరుస ఇళ్ల దొంగతనాలు -- నిందితుడి అరెస్ట్, చోరీ సొత్తు రికవరీ

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని అస్బెస్టాస్ కాలనీలో గత 15 రోజులుగా రాత్రి వేళల్లో వరుస ఇళ్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తులో నిందితుడు గరికపాటి వెంకటేష్గా గుర్తించి అరెస్ట్ చేశారు.

నిందితుడు మొత్తం మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఒక ఇంట్లో మొబైల్ ఫోన్, మరో ఇంట్లో వెండి వస్తువులు, మరో ఇంట్లో 3 గ్రాముల బంగారం మరియు రూ.60,000/- నగదు చోరీ చేసినట్లు గుర్తించారు.

నిందితుడి వద్ద నుండి మొబైల్ ఫోన్ మరియు 3 గ్రాముల బంగారం విజయవంతంగా రికవరీ చేశారు.

నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

1. రూ.10 లక్షల విలువైన నాలుగు బ్యాటరీల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్ -- బ్యాటరీలు రికవరీ

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇవి ఛార్జింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న తోట గురువప్ప ఆగస్టు 15వ తేదీన నాలుగు బ్యాటరీలను చోరీ చేసినట్లు ఫిర్యాదు అందింది.

ఛార్జింగ్ స్టేషన్ సూపర్‌వైజర్ మహేష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తులో నిందితుడు చోరీ చేసిన బ్యాటరీలను స్క్రాప్ షాపులో విక్రయించి, వచ్చిన డబ్బుతో తన స్వస్థలమైన గిద్దలూరుకు వెళ్లిపోయినట్లు గుర్తించారు.

ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ.2.50 లక్షలు కాగా, నాలుగు బ్యాటరీల మొత్తం విలువ సుమారు రూ.10 లక్షలు.

నిందితుడి ఆచూకీని గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని గిద్దలూరుకు పంపించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి చోరీకి గురైన నాలుగు బ్యాటరీలను విజయవంతంగా రికవరీ చేశారు.

నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

పోలీసుల ప్రత్యేక దృష్టి

నేరాల నియంత్రణ, కేసుల త్వరితగతిన ఛేదనకు జగద్గిరిగుట్ట పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు, సమన్వయంతో దర్యాప్తు చేపట్టి కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించి, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన విలువైన సొత్తును రికవరీ చేశారు. ఈ కేసులను డీసీపీ కుత్బుల్లాపూర్ కోటి రెడ్డి, ఆదేశాల మేరకు, ఏసీపీ కుత్బుల్లాపూర్ బాలగంగి రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా ఛేదించారు. కేసుల ఛేదనలో ఇన్‌స్పెక్టర్ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి, ఏఎస్సై రామ్ కుమార్, పీసీలు నరేష్ గౌడ్, రమేష్ మరియు డబ్ల్యూపీసీ సుమ విశేష కృషి చేశారు. వారి సమర్థవంతమైన దర్యాప్తు, కృషి విధి నిర్వహణలో చూపిన ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించి, తగిన రివార్డుతో సత్కరించారు.

6 గ్యారెంటీ లను అర్హులైన ప్రజలకు వెంటనే అందించాలి

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కు బిఆర్ఎస్ నేత కొరిమిశెట్టి సాయిబాబా చౌదరి వినతి

నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వ 6 గ్యారంటీలను ప్రజలకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన కి వినతి పత్రం అందజేసిన గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ లో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన ని బిఆర్ఎస్ పార్టీ తరపున శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మరియు గచ్చిబౌలి డివిజన్ 105 మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు - మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత పథకాలను శేరిలింగంపల్లి పరిధిలోని పేద, మధ్యతరగతి ప్రజలకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందడం లేదని, అధికారులు చొరవ తీసుకుని గ్రామ సభలు, వార్డు సభల ద్వారా అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మాజీ కార్పొరేటర్ బొంబ నవత రెడ్డి, మారబోయిన రవి యాదవ్, సంగారెడ్డి, రోజా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజం దృష్టి తెలుగు న్యూస్ TG/TEL/25/A3731
మంగళవారం 08-09-2026

నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలి: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

నిజం న్యూస్ సైబరాబాద్, సెప్టెంబర్ 7: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్ల యజమానులతో సోమవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థలు చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ తమ కార్యకలాపాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి వ్యాపార సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఓసీ, సీఎంసీ ఎన్‌ఓసీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎన్‌ఓసీ, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఓసీ తదితర అవసరమైన అనుమతులను పొందాలని సూచించారు. ఖ్రామీ పోర్టల్ ద్వారా జారీ చేసిన లైసెన్సుల గడువు ముగిసిన వెంటనే వాటిని సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్సులు పొందిన సంస్థల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సంఖ్యలో హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీపీ తెలిపారు. కొన్ని సంస్థలు సరైన లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వ్యాపార యజమానులు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వివిధ శాఖలకు సంబంధించిన లైసెన్సులు, అనుమతుల సమయాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, నిబంధనలకు లోబడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను సూచించారు. పబ్స్, బార్లు తదితర సంస్థల్లో అనుమతించిన సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించరాదని సీపీ స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలను ఖచ్చితంగా పాటించాలని, సమయం ముగిసిన తర్వాత మద్యం విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లు లోకి మైనర్లు ను అనుమతించవద్దని సూచించారు. వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన ఆధార్ ధృవీకరణ, గుర్తింపు పత్రాలు, వయస్సు నిర్ధారణకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్లను నిబంధనలకు విరుద్ధంగా పనిలోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. హోటల్స్, పబ్స్, రెస్టారెంట్లలో వినియోగదారుల ప్రవర్తనపై కూడా యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఎవరైనా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు లేదా ఇతర ప్రముఖుల బంధువులమని చెప్పుకుని సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినా, నిబంధనలు ఉల్లంఘించినా వారికి ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమేనని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బార్లు, పబ్బుల్లో గ్యాంగ్‌ల మధ్య గొడవలు, ఘర్షణలు జరిగే పరిస్థితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని సీపీ సూచించారు. ఇటువంటి ఘటనలు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు శాంతిభద్రతల సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల వినియోగం, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు వ్యాపార సంస్థల యాజమాన్యాలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. తెలంగాణలో హుక్కా కార్యకలాపాలు నిషేధించబడిన నేపథ్యంలో, ఎట్టి పరిస్థితుల్లోనూ హుక్కా సెంటర్లను నిర్వహించరాదని సీపీ స్పష్టం చేశారు. జూదాలు చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తూ హుక్కా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్ఠంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు సైబరాబాద్ పోలీసుల లక్ష్యం వ్యాపారాలను అడ్డుకోవడం కాదని, చట్టబద్ధంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి సైబరాబాద్ పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని సీపీ తెలిపారు. అయితే చట్టాలు, నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారాలు నిర్వహించే సంస్థలపై మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర సంస్థల యజమానులు పోలీసులకు సహకరిస్తూ నిర్ణీత సమయాలు, లైసెన్సింగ్ నిబంధనలు, సిబ్బంది వయస్సు ధృవీకరణ, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రజా భద్రతకు సంబంధించిన అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ సూచించారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎస్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎస్. కోటి రెడ్డి, ఐపీఎస్, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

– బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి

నిజం న్యూస్ ప్రతినిధి, మేడిపల్లి,సెప్టెంబర్ 07: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కు వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ, ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శైలజకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జక్కు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు. కేవలం 100 రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు, వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ ముఖ్య డిమాండ్లు:

మహాలక్ష్మి పథకం: మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, స్కూటీలను తక్షణమే పంపిణీ చేయాలి. ఆడబిడ్డలకు పూర్తి రక్షణ కల్పించాలి.?

రైతాంగానికి భరోసా: ప్రతి పంటకు రైతు భరోసా, బోనస్ అందించాలి. కౌలు రైతులకు లేకుండా ఎరువులు పంపిణీ చేయడంతో పాటు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 సాయం అందించాలి.?

నిరుద్యోగులు, విద్యార్థులు: అర్హులైన యువతకు జాబ్ క్యాలెండర్, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లించాలి. విద్యార్థులకు విద్యా భరోసా పథకాన్ని వర్తింపజేసి, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.?

సంక్షేమ పథకాలు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన పింఛన్ రూ. 4,000 తక్షణమే అమలు చేయాలి. ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12,000 అందించాలి. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు స్థలాలు ఇవ్వాలి.?

పారిశుద్ధ్యం, పాలన: పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసిందని, వెంటనే చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. హామీలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు.? ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడపల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్, కొత్తూరి మహేష్, లేతాకుల మాధవ రఘుపతి రెడ్డి, కొండే పోచయ్య, మధుసూదన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు ప్రభు, శ్యామల శ్రీనివాస్, ఖలీల్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ, బబ్లెట్ శంకర్, జిలాని పాషా, కిరణ్ నాయక్, అమర్ పటేల్, చిరంజీవి, ప్రవీణ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి బీఆర్ఎస్ నిరసన

22 ఏ భూముల సమస్యపైహామీల అమలులో జాప్యంపై కేపిహెచ్ బి లో భారీ ర్యాలీ

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలు మేరకు కేపిహెచ్ బి డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావు మరియు బాలాజీ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో కేపిహెచ్బి డివిజన్లో నిరసన కార్యక్రమం చేపట్టారు... ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేపిహెచ్బి డివిజన్లోని వసంత్ నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆస్తులను 22 "ఏ" లో పెట్టి ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్న నేపథ్యంలో అలాగే కేపిహెచ్బి డివిజన్లోని ప్రజా అవసరాలకు ఉపయోగపడే భూములను వేలకోట్ల రూపాయలకు అమ్ముకున్న కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా అబద్ధపు 420 హామీలు 6 గ్యారంటీలు వెయ్యి రోజులైనా పూర్తి చేయని నేపథ్యంలో 420 అడుగుల గల బాకీ కార్డు తో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కెపిహెచ్బి టెంపుల్ బస్ స్టాప్ నుంచి మూడో ఫేస్ జయశంకర్ విగ్రహం వరకు భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి అక్కడ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సంక్షేమ పథకాలను కూడా రద్దుచేసి అన్ని రంగాల్లో కూడా సంక్షోభం ఏర్పాటు చేసి ప్రజల జీవనోపాధి కి గండి కొట్టిందని.. ఆర్థిక ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నారని రేవంత్ రెడ్డి నిరంకుశ పరిపాలనకు నిరసనగా ప్రజలకు అండగా ఉంటామని వారు తెలిపారు. ..ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా ,డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు కృష్ణారెడ్డి ,ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, రాజేష్ రాయ్,సీనియర్ నాయకులు శ్యామల రాజు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కే .పవన్ కుమార్, హరినాథ్, సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, కంచరపల్లి నాగరాజు, సుభాష్ గౌడ్ ,రమణ ,రాంబాబు నాయుడు , గఫూర్,కబీర్ ,ఖైలర్, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్ ,రాహుల్ షా,మోహిష్, దినేష్, మహిళా నాయకులు అనిత శ్రీనివాస్ ,అరుణ శెట్టి, లక్ష్మీరాజ్యం ,ధనలక్ష్మి, హేమ ,సుబ్బలక్ష్మి ,లక్ష్మి, ఉష, లలిత స్వప్న ,సావిత్రి ,ప్రేమలత తదితరులు పాల్గొన్నారు..

అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న స్థానిక పండ్ల వ్యాపారిని పరామర్శించిన ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

నిజం న్యూస్ ప్రతినిధి, ఉప్పల్, సెప్టెంబర్ 07 : వీరప్పగడ్డ డివిజన్ రామాలయం ప్రాంతానికి చెందిన స్థానిక పండ్ల వ్యాపారి ఇటీవల గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో టీ ఎక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి నారాయణలోని తన నివాసానికి చేరుకున్నారు. ఆయన హనుమాన్ టెంపుల్ సమీపంలోని సోమవారం మార్కెట్ వద్ద పండ్ల బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వీరప్పగడ్డ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) నారాయణకు వెళ్లి ఆయనను స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కూడా కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. "కష్టాల్లో ఉన్న మనిషికి అండగా నిలవడం, ఆపద సమయంలో ధైర్యం చెప్పడం మానవత్వానికి నిదర్శనం. మీరు త్వరగా కోలుకుని మళ్లీ ఆరోగ్యంగా మీ రోజువారీ జీవితం కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీకు, మీ కుటుంబానికి ఎల్లప్పుడూ నా సహాయ సహకారాలు ఉంటాయి" అని ఇర్షాద్ ఖాన్ భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలతో పాటు వారి వ్యక్తిగత కష్టసుఖాల్లోనూ అండగా ఉంటూ, ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తన లక్ష్యమని ఇర్షాద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఇర్షాద్ ఖాన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పినందుకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో 420 హామీల అమలుపై బీఆర్ఎస్ వినతిపత్రం

నిజం న్యూస్ పటాన్ చెరువు, సెప్టెంబర్ 7: పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 420 హామీల అమలుపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్పన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నర్సింహా గౌడ్ కలిసి అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ ని కలిసి ప్రజల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఎన్నికల హామీలపై వినతిపత్రం అందజేశారు. రైతులకు రైతుభరోసా, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, రైతు కూలీలకు భరోసా, మహిళలకు మహాలక్ష్మి పథకం, నిరుద్యోగులకు ఉద్యోగాలు--భృతి, విద్యార్థులకు విద్యాభరోసా, పెన్షన్ పెంపు, ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం, బీసీ--ఎస్సీ--ఎస్టీ--మైనారిటీలకు ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానం చేసిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగానే ఈ వినతిపత్రాన్ని సమర్పించడం జరిగిందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేయడం జరిగిందని. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, ఉపేందర్ రెడ్డి, కొల్లారు చంద్రశేఖర గోపాల్, బిజిలి రాజు , నవనీత జగదీష్,కవితా శ్రీనివాస్ రెడ్డి, మంజుల ప్రమోద్ రెడ్డి, యూసుఫ్ ,మాజీ కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు,మాజీ యూనుస్, సీనియర్ నాయకులు దాసు యాదవ్, చంద్రశేఖర్,రాజు, చౌటకారి మహిపాల్ రెడ్డి, లింగం గౌడ్, బలాపూర్ మాణిక్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విత్తన గణపతి

నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో - ఫౌండర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాఘవేందర్ యాదవ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ తీసుకువచ్చిన విత్తన గణపతిని చందానగర్ మాజీ కార్పొరేటర్ నవత రెడ్డికి రాఘవేందర్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించకుండా వినాయక చవితి వేడుకలను నిర్వహించేందుకు విత్తన గణపతి ఒక మంచి సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. గణపతి నిమజ్జనం అనంతరం విత్తనాలు మొలకెత్తి విగ్రహం రూపాంతరం చెందిన ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో మరింత అవగాహన కల్పించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత పద్ధతులను పాటిస్తూ పండుగలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణతో పాటు భవిష్యత్తు తరాలకు వచ్చని వాతావరణాన్ని అందజేసేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట్‌లో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్

నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: మూసాపేట్‌లో హనుమాన్ చౌక్ మహావీర్ భక్త మండలి ఎదురుగా ఉన్న రోడ్డులో జిల్లా అర్జున్ -- అనిత నూతనంగా నిర్మించుకున్న నివాస గృహ గృహప్రవేశ కార్యక్రమానికి బీజేపీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బండి రమేష్ అర్జున్, అనిత కి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని, కుటుంబం సభ్యులందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్, సయ్యద్, టింకు బాబు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ బాలాజీనగర్ లో కమ్యూనిటీ హాల్, సిసి కెమెరాల ప్రారంభం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతులమీదుగా ప్రారంభోత్సవం



నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 7: బాలాజీ నగర్ డివిజన్ లోని న్యూ బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ పాటు సిసి కెమెరాల వ్యవస్థను కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. సోమవారం న్యూ బాలాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జూకంటి వెట్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై కమ్యూనిటీ హాల్, సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధితోపాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాల్ ఉపయోగపడుతుందని, కాలనీ భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. కాలనీలో ప్రజల భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని, అనుమానాస్పద ఘటనలు చోటు చేసుకున్నప్పుడు నిఘా వ్యవస్థ పోలీసులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజలు కూడా సీసీ కెమెరాల నిర్వహణలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, వెంకటేష్, కొండల్ రెడ్డి, రమణ, వినోద్, రమేష్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.